# 10. ఇది కథ

ప్రొప్రయిటరు టేబిలు దగ్గిర గొడవ జరుగుతోంది.

రామ్‌సింగ్, చౌకీదారు, ఒకతని కాలరు పట్టుకొని టేబిలువైపు తోస్తున్నాడు.

"ఏరా! సాపాటు మెక్కి దుడ్డివ్వవురా"? అరుస్తున్నాడు శంకరయ్య. అతడి నోటినుండి తమలపాకురసం తుంపరలుగా మీద పడుతుంటే ఆ యువకుడు అమాయకంగా చుట్టూ మూగిన వారందరినీ చూస్తూ ఉన్నాడు.

"ఇంకా ఏమంటున్నాడు సార్! ఈ ఆనందనిలయం ఇతగాడిదేనంట!" సాంపెంట సింగన్న టేబిళ్ళు తుడిచేగుడ్డ అందరిమీద దులుపుతూ అన్నాడు.

"ఏందిరా! సైత్తెకారీ!" బొద్దుగా పొట్టిగావున్న షణ్ముఖానంద విలాస్ మద్రాసీ మీల్స్ అండ్ కాఫీ హోటల్ ప్రొప్రయిటరు శంకరయ్య ఉరిమాడు.

అన్నిటికీ ఆ యువకుడేమీ జవాబు చెప్పలేదు. మిడుకు మిడుకుమంటూ చూస్తున్నాడు.

"చొక్కా యిప్పేయించండి!" సింగన్న అన్నాడు.

"అరే! విను!" శంకరయ్యర్ గట్టిగా అరిచాడు.

"నా పేరు శంకరయ్యర్ కాదు, సంకరయ్యర్! అర్థం తెలుసుకున్నావా! రాణీ రాసమణీదేవి వంటి వాళ్ళే నన్నిక్కడ నుంచి కదిలించ లేకపోయారు. నేను జంటిల్మన్‌లలో జంటిల్మన్‌ని రౌడీలలో రౌడీని! తెలుసా! కాళ్ళమీదపడు - విడిచిపెడతా. ఈ యిల్లు నీదని డాబులు పలికితే దేహశుద్ధి జరుగుతుంది."

భోజనాలుచేస్తున్న చాలమంది అటువేపే చూస్తున్నారు. రామ్‌సింగ్ ఆ యువకుడిని అయ్యరు పాదాలవేపు తోస్తున్నాడు. కాని అతను విదిలించుకొంటున్నాడు.

ఆ సమయంలో కృష్ణయ్యగారు హోటలులోకి వచ్చారు.

"ఏంటయ్యా, అయ్యరూ? ఈ గొడవేమిటి?" అడిగారాయన.

"చూడండిసార్. ఈ బద్మాష్‌ని. తిండితిని పారిపోదా మనుకుంటున్నాడు." అన్నాడు సింగన్న.

"సైత్తెకారి!"అన్నాడు అయ్యరు.

"సైగా ఈ ఆనంద నిలయం ఈడిదేనంట!" అన్నాడు సింగన్న.

"కుర్రాడు చూస్తే చదువుకున్నట్టున్నాడు. మంచివాడివలె కనిపిస్తున్నాడు. అతనిని వదిలివేయండి" అన్నారు కృష్ణయ్యగారు.

రామ్‌సింగ్ కాలరు విడిచిపెట్టాడు.

"నువ్వు తెలుగబ్బాయివేనా?" కృష్ణయ్యగారు ప్రశ్నించారు.

అతడు తల ఊపాడు.

"అయ్యరూ! ఇతని భోజనం నా ఖాతాలోకి ఎక్కించు."

"మంచిదేసార్!" శంరయ్యరు వినయం ఒలుకబోశాడు.

"ఇంతకీ నీ పేరేమిటి?" కృష్ణయ్యగారు అడిగారు.

"రాధాకృష్ణ"

"చదువుకున్నావా?"

"చదువుకున్నాను"

"లెక్కలు కట్టడం, అకౌంట్లు చూడడం..."

"చెయ్యగలను"

"బెంగాలీ వచ్చా, ఎంతవరకు?"

"బెంగాలీలోనే చదువుకున్నాను."

"తెలుగు వచ్చా?"

"రాకేం!"

"నీ వంటి వాడికోసమే చూస్తున్నాను. విను, నేను గుంటూరునుంచి వచ్చాను. వారంరోజులై బాలీగంజి బజారులో ఒక దుకాణం అద్దెకు తీసుకున్నాను. గుంటూరు గోంగూర పచ్చడి, దోసావకాయ, కొరివికారం, అల్లంచట్నీ మొదలయినవి కుటీరపరిశ్రమల క్రింద తయారు చేయిస్తున్నాను. కలకలత్తాలో వీటకి మంచి గిరాకీ ఉంది. సరకు వచ్చి స్టేషనులో పడివుంది. నాకు తొందర పని వచ్చిపడింది. నువ్వు నమ్మకంగా దుకాణం నడపగలవా?"

"తప్పకుండా!" ఆ యువకుడి కళ్ళలో ఆనందం తొణికింది.

"ఎంత ఇమ్మంటావు?"

"భోజనం - వసతి"

"అయ్యరూ! ఈయనకి రోజూ భోజనానికి టిఫిన్‌కి ఎంతవుతుంది?"

"నాలుగువందల రూపాయలు సార్!"

"బసకి?"

"నా దగ్గర మంచాలు లేవు."

"చూడవయ్యా బాబూ! పగలంతా పనిచేస్తే రాత్రి పడుకోనక్కరలేదా?"

"కృష్ణయ్యగారూ! మీరు ఇంతగా అడుగుతున్నారు కాబట్టి...ఒక్కటే చోటుంది. మూడో అంతస్తు డాబా మెట్లకింద బాత్‌రూమ్‌కి ఎదురుగా, చిన్న మంచం ఒకటి ఖాళీగా ఉంది. అది తప్ప మరేవీ లేవు."

"అటువంటిచోట ఈ కృష్ణయ్యగారి మనిషి ఎలా ఉంటాడయ్యా."

"అయ్యా! అక్కడ ఉండడానికి నాకు ఎటువంటి అభ్యంతరంలేదు" అన్నాడు రాధాకృష్ణ.

"అయ్యరూ! దానికి బాడుగ ఎంత?"

"మూడు వందలు!"

"మంచిది. వెంటనే ఏర్పాటుచెయ్యి ...అబ్బాయ్! నా గదికిరా. విషయాలు మాట్లాడుకుందాం."

కృష్ణయ్యగారు భోజనం ముగించి, రైల్వే రసీదులు రాధాకృష్ణకిచ్చారు. బజారులోనున్న షాపు చూపించారు. అక్కడ ఒక టేబిలు, కుర్చీ, డబ్బుకోసం ఒక పెట్టె ఉన్నాయి. అలమారాలు తయారవుతున్నాయి. సరుకు లందించడానికి కుర్రాడిని ఒకడిని కుదిర్చారు ఆయన.

ఆ రాత్రే కృష్ణయ్యగారు వెళ్ళిపోయారు.

'ఆంధ్రా పికిల్స్ అండ్ చట్నీస్' మరో మూడు రోజుల తరువాత బాలీగంజిలో తెరిచారు. ప్రారంభోత్సవము చాల గొప్పగా చేయాలని కృష్ణయ్యగారు అనుకున్నారు. కాని, తొందరగా వెళ్ళిపోయారు. రాధాకృష్ణ మాత్రం పని కుర్రాడిచేత మిఠాయి తినిపించి అమ్మకం ప్రారంభం చేశాడు.

వారం రోజుల తరువాత కృష్ణయ్యగారినుండి ఉత్తరం వచ్చింది. దానితో మరికొన్ని రసీదులు వచ్చాయి. ఇంకా సరుకు ఆయన పంపుతున్నారు. క్రమ క్రమంగా వ్యాపారం పెరగడం మొదలయింది. నెల్లాళ్ళలో మంచి స్థాయి అందుకొంది.

ఒక శనివారంనాడు రాత్రి రాధాకృష్ణ బసకు వచ్చేసరికి అతని మంచంమీద ఎవరో పెద్దమనిషి హోల్డాలు విప్పుకుని, మంచంకింద చిన్న సూటుకేసు పెట్టుకొని, హాయిగా చుట్ట కాలుస్తున్నాడు.

రాధాకృష్ణకు చాల ఆకలిగా ఉంది. ఏవో రెండు మెతుకులు తిని, ఆ నాలుగుడగుల నులక మంచం మీద నడుము చేరవేద్దా మనుకునేసరికి అంతరాయం కలిగింది.

"శంకరయ్యర్ !" గట్టిగా అరిచాడు రాధాకృష్ణ.

మూడవ అంతస్థులోనే ఒక మూలనున్న గదిలో శంకరయ్యరు ఉంటున్నాడు. అప్పుడే

ఏదో పనిమీద గదికి వచ్చాడు.

"ఎందుకరుస్తున్నావ్?" అడిగాడు అయ్యరు.

"ఈ అరాచకమేమిటి?"

"అరాచకమేముంది. ఇది వ్యాపారం. నువ్వు పది రూపాయలిస్తున్నావు రోజుకు - ఈయన పదిహేను రూపాయలిస్తానన్నాడు. మరో బస చూసుకొని పో. సాపాటు ఇక్కడ చేద్దుగాని."

"శంకరయ్యర్! నీకు ధనబలముంది. లాయర్ల బలముంది - రౌడీల బలముంది - నోటి బలముంది. ఇంకా ఎన్నో బలాలున్నాయి. లేకపోతే ఈ కలకత్తా మహాపట్నంలో ఎలా నెగ్గుకొస్తున్నావ్? కాని, ఒక్కమాట విను - నీ బలాలకు వందరెట్లు గొప్పదయిన నైతిక బలముంది నాకు. నీకు, నా బసక్రింద, భోజనం క్రింద వేయిరూపాయలు జమకట్టారు కృష్ణయ్యగారు. నేను ఇక్కడ చేరి నెల్లాళ్ళయింది ఇంకా మూడు వందల రూపాయలు నీమీదనే ఉన్నాయి జ్ఞాపకముందా?"

"సైత్తెకారికి ఇంత తెలివా?"

"నువ్వు రాణీ రాసమణిగారి దగ్గర ఈ భవనాన్ని పది సంవత్సరాల క్రింద నెలకు మూడువందల రూపాయల అద్దెకు తీసుకున్నావు. ఈనాడుకూడా అదే సొమ్ము ఇస్తున్నావు. నీకొక న్యాయము, ఇక్కడ బసచేసేవారికి మరొక న్యాయమూనా?...వెంటనే నా మంచం కాళీ చేయించు. నీతో వాదించడానికి నాకు తీరికలేదు."

శంకరయ్యర్ బొజ్జమీద చేయి వేసుకున్నాడు.

"పదండి సార్! ఈ రాత్రికి నాతో పడుక్కోండి. నేనొక్కడినే ఉంటున్నాను. రేపు మరో గదిలో జాగా చూపిస్తాను."

శంకరయ్యరు పెట్టె పట్టుకుంటే, అతనెవరో హోల్డాలు చుట్టుకుని మంచం కాళీ చేశాడు.

రాధాకృష్ణ భోజనంచేసి పడ్డదేపాటుగా ఆ నులకమంచం మీద నిద్రపోయాడు.

రాధాకృష్ణ ఇన్ని ఇబ్బందులకు లోనయి బాధపడవలసి వచ్చింది, మాట పట్టింపు వలననే.

...బారిస్టర్ సన్యాల్ ఒక వేయి రూపాయలు బదులిస్తానన్నాడు. కాని, విషయమంతా విన్న తరువాత ఒక పైసకూడా బదులు తీసుకోనన్నాడు. రాణి రాసమణీదేవిగారి అభిప్రాయం, తాను మూడు సంవత్సరాలు స్వశక్తిమీదనే జీవించాలని ఉంటే, తాను అప్పు పుచ్చుకొని సుఖంగా బ్రతకమని కాదు. తనకు పాతికేళ్ళు నిండగనే చాల ఆస్తి చేతికి వస్తుంది. ఆ ఆస్తిని కాపాడుకునే సామర్థ్యం ఉందో లేదో తెలుసుకోడానికే ఆమె అన్ని ఏర్పాటులు ఒక్కసారి ఆపివేసి అగ్నిపరీక్షకు తనను బలిచేసింది. ఈ విషయం ముందు తెలిసి ఉంటే తానూ జాగ్రత్తపడి ఉండేవాడు.

ఒకనాటి ఉదయం వార్డెనువచ్చి మరునాడే హాస్టలు కాళీ చేయమంటే తాను దిగ్భ్రాంతిచెందాడు. బారిస్టరు సన్యాలు అన్ని విధాలయిన ఆర్థిక సహాయాలను ఆపివేశారని, వెంటనే హాస్టలు విడిచిపెట్టవలసిందని వార్డెను ఆదేశించాడు. పరీక్షలు ఇంకా పదిహేను రోజులే ఉన్నాయి. చా ల శ్రద్ధతో చదువుతుంటే ఒక్కసారి మబ్బు లేకుండానే ఆకాశంమీదనుండి పిడుగు పడింది.

రాధాకృష్ణ గదిలో మతిలేకుండా కూర్చున్నాడు. తన ఇరవై మూడో పుట్టినదినం సందర్భంగా సాయంకాలం చిన్న పార్టీ ఏర్పాటు చేశాడు. ఎన్ని కిలోలు స్వీట్ తేవాలని అడగడానికి వాచ్‌మన్ గురుంగ్ వచ్చాడు. విషయం తెలుసుకొని అతను రాధాకృష్ణకొక సలహా ఇచ్చాడు. డెహరడూన్ కాలేజీలో ఈ విధమయిన ఇక్కట్లు ఒకొక్కప్పుడు రాజకుమారులకు కూడా సంభవించుతవి. మహారాజులు అకస్మాత్తుగా చచ్చిపోతే వాళ్ళ పుత్రులకు, వారసులకు ఇదే గతి పడుతుంది. సేఠ్ అగర్‌వాల్ ఇటువంటి సమయాలలో చాల ఉపయోగపడతాడు. అతడు వస్తువులు తనఖా పెడతాడు. అమ్మితే కొంటాడు. బహుశా తక్కువ ధరే కావచ్చు. కాని, రొక్కం చేతిలో పడుతుంది. ఇంతకన్న డెహరాడూన్‌లో ఆపద్బాంధవులు లేరు.

గురుంగ్ చెప్పిన ప్రకారం ముందు కొన్ని సూట్లు తనఖా పెట్టాడు. పరీక్షలయిన తరువాత పుస్తకాలు, కలాలు, ఈవిధంగా ముందు తాకట్టు పెట్టి చివరకు వాటినన్నిటిని అమ్మివేశాడు. ఆ ప్రకారంచేస్తే డెహరాడూన్‌లో మరొక నెల్లాళ్లుండి పరీక్షలు వ్రాసి, తొడుక్కున్న చారల షరాయి, బూడిదరంగు చొక్కాతో కలకత్తా చేరుకున్నాడు. రైలు దిగిన వెంటనే బారిస్టరు సన్యాలుని కలిశాడు. రాణీ రాసమణీదేవి వీలునామా ఒకటి వ్రాసి రిజిస్టరు చేయించి మరీ చనిపోయింది. ఆమె అభీష్టం ప్రకారం చిన్న రాసమణికి ఇరవై ఒకటవ సంవత్సరం నిండగనే పెండ్లి చేసుకోవచ్చు. ఆమెను వివాహమాడిన వారికి ఆనందనిలయం చెందుతుంది. ఆస్తిని ఆ భార్యాభర్తలిద్దరూ అనుభవించవచ్చు. ఇప్పటి వరకు చిన్న రాసమణి రాధాకృష్ణనే వివాహమాడడానికి నిశ్చయించినట్లు తన ఉత్తరాలద్వారా తెలియజేస్తూ ఉంది. అందుచేత ఒకవేళ వివాహం ఆలస్యమయినా ఆనందనిలయంమీద వచ్చే ఆదాయం రాధాకృష్ణ ఖర్చులకు అతనికి ఇరవై ఐదు సంవత్సరాలు వెళ్ళిన తరువాత ఇవ్వవలసి ఉంది. చిన్న రాసమణి మనసుమారి ఇంకొకరిని వివాహమాడితే ఆ వ్యక్తికే ఆనందనిలయం చెందుతుంది.

ఇటువంటి పరిస్థితులలో రాధాకృష్ణకు ఆర్థికసహాయం ఆగిపోయింది. చిన్న రాసమణికి ఉత్తరం వ్రాస్తే వెంటనే డబ్బు పంపుతుంది. బాబాయిగారిని కలిసినా ఆయన ఇంట్లో ఉంచుకుందురు. ఆయన ఇప్పటికికూడా వారి వ్యవహారాలు చూస్తున్నారు. రాణీ రాసమణీదేవిగారి వీలునామా ఆయనకు తెలియదా? విధిగా తెలుస్తుంది. కాని ఆయన చాల నమ్మినబంటు. యజమానురాలి ఆజ్ఞలు తూ.చా. తప్పకుండా పాటించవలసిన వారాయన. రాణీ రాసమణీదేవిగారి ఆస్తి లక్షలు విలువచేసేది, మూడు సంవత్సరాల తరువాత ఆమె మనుమరాలితో సహితం తనకు సంక్రమించబోతుంటే, ఈ చిన్న పరీక్షలో నెగ్గడం

కష్టమయినపనికాదు.

ఒక్కటి మాత్రం నిజం. ఆనంద నిలయం చేరేసరికి చేతిలో పావలా కాసుకన్న డబ్బులు లేవు. ఆకలి విపరీతంగా వేస్తున్నది. భోజనం చేసిన తరువాత బిల్లు చెల్లించడం ఆ హోటలులో రివాజు, పెరుగు, అప్పడాలు మొదలయినవి ఎక్స్ట్రాగా వేసుకుంటే భోజనం ఎనిమిది రూపాయలకు మించిపోయింది. అప్పుడు సెర్వర్‌తో తాను ఒక మాట అన్నాడు. ఈ ఆనందనిలయం తనదేనని, ప్రస్తుతానికి డబ్బులులేవని, సాయంకాలమో, రేపో యిస్తానని అయ్యరుతో చెప్పమని అన్నాడు. అప్పుడే రభస మొదలయింది. ఆపద్బాంధవుడు ఆ కృష్ణయ్యగారు చక్రం అడ్డువేశారు. లేకపోతే ....

నెలరోజుల తరువాత వస్తానన్న కృష్ణయ్యగారు ఆరునెలల వరకూ రావడానికి వీలుచిక్కలేదు. ప్రతినెల హెచ్చు సరుకు పంపడానికి ఆయన నాలుగు ఊళ్ళు తిరుగవలసి వచ్చింది. కలకత్తా షాపులో అమ్మకం రోజు రోజుకు పెరిగింది.

కృష్ణయ్యగారు తన కళ్ళను తానే నమ్మలేకపోయారు. ప్రొద్దున్న ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకూ మనుషులు వస్తునే ఉన్నారు. అందరూ సరుకు కొనడానికి వస్తున్నారో, రాధాకృష్ణతో మాట్లాడి వెళ్ళిపోవడానికి వస్తున్నారో అతనికి అర్థంకాలేదు. అతను అందరితోనూ వినయంగా మాట్లాడుతున్నాడు. తెలుగు, హిందీ, బెంగాలీ, ఇంగ్లీషు భాషలలో మాట్లాడుతున్నాడు. పిల్లలతో, పెద్దలతో, వయసులోనున్న అమ్మాయిలతో అందరితో చనువుగా మాట్లాడుతున్నాడు. సరుకు గురించి చాల చక్కగా చెప్తున్నాడు. అప్పుడో అమ్మాయి అడిగింది.

"నీకు మరో చొక్కాలేదా?...నెల్లాళ్ళక్రింద ఇదే బూడిద రంగు చొక్కా...నిన్ననూ ఇదే ...నేడూఇదే!...నువ్వు చూస్తే చక్కనివాడివి. మంచి చొక్కా కుట్టించేదా?"

"ఇటువంటి చెల్లెళ్ళు నాకున్నందుకు ఎంతో గర్వంగా ఉంది. ఏదో పండుగనాడు మీ యింటికివస్తే నోటినిండా మిఠాయి. ఒంటినిండా బట్టలు పెడుదుగాని మీ అన్నకు." అన్నాడు రాధాకృష్ణ నవ్వుతూ.

ఆ మాటలు వింటుంటే కృష్ణయ్యగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఎవరీ రాధాకృష్ణ?

దుకాణం కట్టేసిన తరువాత ఇద్దరూ హోటలుకి భోజనాలకు వెళ్ళారు. కృష్ణయ్యగారు చాల ఆప్యాయంగా చాల విషయాలు అడిగారు. ముక్తసరిగ జవాబు చెప్పాడు రాధాకృష్ణ. ఆ రాత్రి ఆయన అకౌంట్లు తణిఖీ చేశారు. చిల్లిగవ్వనుంచి చిఠాలో ఉంది. రోజువారీ అమ్మకాలు, ఖర్చులు, వచ్చిన సరుకు, అమ్మగా మిగిలిన సరుకు ఏరోజుకారోజు పుస్తకాలలో విపులంగా దొరికింది. ప్రతినెల సరుకుకోసం పాతికవేలు పంపగా, ఖర్చులన్నీ పోను, ఒక లక్షా ఏభైవేల రూపాయలు బాంకిలో నిలువ ఉన్నవి. మరొక ఇద్దరు కుర్రాళ్ళను తన అనుమతి పొంది వేసుకున్నా, అమ్మకం సమయంలో రద్దీ హెచ్చుగానే ఉంది.

కృష్ణయ్యగారు చాల జాగ్రత్తగా పుస్తకాలలో రాధాకృష్ణ జీతం గురించి వెదికారు. భోజనానికి, బసకు అయ్యే డబ్బు జీతం క్రింద అతను ఖర్చు వ్రాస్తున్నాడు. మరొక పదిరూపాయలు చాకలి, మంగలి ఖర్చులకు - అంతకు మించి మరేమీ ఖర్చు వ్రాయలేదు. తొలిరోజు తాను ఏ బట్టలలో రాధాకృష్ణను చూశారో, ఇవాళకూడ అవే బట్టలలో అతను ఉన్నాడు.

ఇవన్నీ ఒక ఎత్తు. రాధాకృష్ణ ఒకడే ఒక ఎత్తు. అతడు చూడడానికి చాలా అందంగా ఉంటాడు. విశాలమయిన కళ్ళు. ఆ కళ్ళల్లో గంభీరమయిన చూపులు, పెదవులమీద నిరంతరం నాట్యమాడే చిరునవ్వు. మాటలు మృదువుగా హృదయానికి హత్తుకుంటాయి. పొరపాటున హాస్యానికయినా అతను అనృతమాడలేదు. ఎవరినీ నిందించలేదు. పనిచేసే తీరు చాల అద్భుతంగా ఉంది. వ్రాత ఆణిముత్యాలలా ఉంటుంది. ఇంగ్లీషు మాటలు చాల సభ్యతతో గౌరవంతో నిండి ఉన్నవి. ఇటువంటి మేనేజరు లభించడం నిజంగా అదృష్టమే.

కృష్ణయ్యగారు రెండు రోజులున్నారు. రడీమేడు దుకాణంలో రాధాకృష్ణకు రెండు జతల బట్టలు తీసుకున్నారు. అవికాక తువాళ్ళు, దుప్పట్లు, తలగడలు కొన్నారు. ప్రత్యేకంగా హోటలులో ఒక గది ఏర్పాటే చేశారు. అతని స్వంత ఖర్చులకు నెలకు నూరు రూపాయలు అనుమతించారు. మనసార దీవించి, ఆప్యాయంగా హత్తుకొని, కొడుకుని విడిచి వెళ్ళలేని తండ్రిగా కృష్ణయ్యగారు వెళ్ళిపోయారు.

కృష్ణయ్యగారు వెళ్ళిన మరునాడే చిన్న రాసమణికి ఎయిర్ లెటరు వ్రాశాడు రాధాకృష్ణ. అందులో మామూలు యోగక్షేమాలతోపాటు ఆంధ్రాపికిల్స్ అండ్ ఛట్నీస్ - ఆఫీసు అడ్రసు ఇచ్చాడు. చిన్న రాసమణి అమెరికానుండి పారిస్ చేరిన తరువాత డెహరాడూన్ అడ్రసుకి ఒక ఉత్తరం వ్రాసింది. డెహరాడూన్ విడిచిపెట్టే రోజునే అది అందింది. కాని తరువాత తనదన్న డబ్బు ఆరు నెలలవరకు చేతిలో లేకపోవడంచేత ఆమెకు జవాబు వ్రాయలేదు. కృష్ణయ్యగారు కల్పించిన సదుపాయం చేతికందిన వెంటనే ఉత్తరం వ్రాశాడు.

నాలుగోరోజులకి పారిస్‌నుండి కేబిలు వచ్చింది. ఉత్తరం అందింది - ఆరు నెలలబట్టి అలమటిస్తున్న హృదయానికి శాంతి లభించింది.

కేబిలు చూడగానే రాధాకృష్ణకు కళ్ళంట అప్రయత్నంగా నీళ్ళు కారాయి - చిన్న రాసమణిని ఈవిధంగా శిక్షించడంలో అర్థమేముంది?

మరొక్క రెండు రోజులలో ఉత్తరం చేరింది.

"ప్రియమైన కన్నయ్యా!

"నన్ను బాధపెట్టడానికి వేరే మార్గాలు లేవా? పారిస్ చేరిన వెంటనే నీకు ఉత్తరం వ్రాశాను. ఎప్పటికీ జవాబు లేకపోతే బారిస్టరు సన్యాల్‌కి కేబిలు చేశాను - నువ్వు కలకత్తా చేరిన సంగతి తెలిసింది. తరువాత మరి వార్తలు లేవు. ఏ పని చేయాలన్నా నువ్వే నా తలపుకి

వచ్చి కళ్ళనిండా నీళ్ళు తిరిగేవి. నువ్వెక్కడ ఉన్నావో తెలియదు. ఏమి చేస్తున్నావో తెలియదు. ఆరు నెలల తరువాత అకస్మాత్తుగా ఆంధ్రాపికిల్స్ అండ్ ఛట్నీస్ అడ్రస్‌తో ఉత్తరం వస్తే నా తల తిరిగిపోయింది. ఏడవాలో నవ్వాలో నాకు తెలియదు. ఈ తెలుగు ఆవకాయలలోను పచ్చళ్ళలోను పడిపోయి నీ చిన్న రాసమణినే మరచిపోయావా? ఎందుకక్కడ ఉద్యోగం చేస్తున్నావ్. మన ఆస్తి ఎంత తిన్నా పది తరాలవరకూ తరగదని నీకు తెలియదా? నీకేం కర్మవయ్యా! ఏం చేస్తాను - కళ్ళంట ధారాపాతంగా నీళ్ళు కారుతుంటే రాత్రంతా ఏడ్చాను. ఇప్పటికైనా నేను జ్ఞాపకానికి వచ్చి ఉత్తరం వ్రాశావు - అదే పదివేలు. తీరుబడి చూసుకొని పార్కు స్ట్రీటులోని మన భవనానికి వెళ్ళు - దానిని రీమోడల్ చేస్తున్నారు - నువ్వు చెప్పిన ప్రకారమే మార్పులు చేయిస్తున్నాను - బాబాయిగారు రిటైరవుతానంటూ ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఆ యింటి భారం నీకు అప్పగించిన తరువాత ఆ పని చేయమని జవాబిచ్చాను. రోజులూ, గంటలు, నిమిషాలు లెక్కపెడుతున్నాను - ఇంతకన్న ఏమి వ్రాయను?"

నీ రాసమణి."

రాధాకృష్ణ ఆ ఉత్తరం చాలసార్లు చదువుకున్నాడు. తను కూడా ఆమెకుమల్లే తపిస్తున్నాడు.

ఉన్నట్లుండి కృష్ణయ్యగారికి టెలిగ్రాము వచ్చింది. మూడు సంవత్సరాలయి కలకత్తా వ్యాపారం మూడు పిందెలు ఆరు కాయలు కాసింది. ఒక్కొక్కప్పుడు సరకు సప్లయి చేయడానికి కూడా ఇబ్బంది కలిగేది. రాధాకృష్ణ మీద అతనికి అపరిమితమైన వాత్సల్యం కలిగింది. ఎంత తరచి అడిగినా అతని సంగతి కొంచెమయినా అంతుపట్టలేదు. ఆ టెలిగ్రాములో వ్యాపార విషయాలు ఏవిలేవు. ఆదివారంనాడు పార్కు స్ట్రీటులో తన వివాహమని, వచ్చి వధూవరులను ఆశీర్వదించమని మాత్రం అందులో ఉంది. ఇంకా రెండు రోజులే వ్యవధి - కృష్ణయ్యగారు ఆ మరునాడు బయలుదేరారు.

టాక్సీదిగి పెండ్లి పందిరిలోకి ప్రవేశించిన కృష్ణయ్యగారి ఆశ్చర్యానికి అంతులేదు. పెండాలు అలంకరణకే రెండు లక్షలయి ఉంటాయి. వేదికకు దగ్గిరగా పెళ్ళికొడుకు తలమీద జీలుగు బెండు కిరీటం పెట్టుకొని కూర్చున్నాడు. కృష్ణయ్యగారిని చూడగనే లేచివచ్చి పాదాలు తాకి, వంగి నమస్కరించాడు. అతిథులకు అతనిని పరిచయం చేశాడు. "వీరు మా పెదతండ్రిగారు. వాణిజ్య వేత్తలు" అని అందరితో చెప్పాడు.

వచ్చిన అతిథులలో షణ్ముఖ విలాస్ ప్రొప్రయిటరు శంకరయ్యర్‌కూడా ఉన్నాడు. పెంపుడు కుక్కలా వినయంగా నిలబడ్డాడు.

ఆ రాత్రి కృష్ణయ్యగారికి తెలిసింది తన రాధాకృష్ణ ఎవరో - పెండ్లి అయిపోయింది.

మరునాడు న్యూఢిల్లీ వెళ్ళడానికి ప్లేను టిక్కట్లు రిజర్వయాయి - ఢిల్లీ చేరి అక్కడనుండి హనీమూన్‌కి సిమ్లా వెళ్లారు నవ వధూవరులు.

రాసమణి బాత్‌రూమునుండి వస్తున్న రాధాకృష్ణ భుజాలమీద చేతులు వేసి ఆపింది.

"కన్నయ్యా! అయ్యరు ప్రాణాలు తింటున్నాడు కనీసం ఆరునెలలయినా ఖాళీచేయడానికి గడువియ్యమంటున్నాడు"

"రాసమణీదేవి చెప్తే కాదంటానా? ఆరునెలలు కాదు - ఒక సంవత్సరం గడువిస్తున్నాను - తరువాత ఖాళీ చేయకపోతే అయ్యరుని, అతని పరివారాన్ని బంగాళా ఖాతంలో విసిరి వేయిస్తాను."

రాసమణీదేవి నవ్వింది. అవి విరిసిన పారిజాతాలు.

రాధాకృష్ణ ఆమెవైపు చూచాడు. అవి పువ్వుల బాణాలు. కథ అయిపోందా?....కాని ఇది అసలు కథకాదే....

* * *

మానవుడి మెదడులో రెండు గదులుంటాయి. ఒకదానిలో హేతువాదబద్ధమైన ఆలోచనలు తావు చేసుకుంటాయి. రెండవ దానిలో ఊహాలోక సౌందర్యాలు, అద్భుతాలు, ఆశ్చర్యకరమైన విషయాలు చోటుచేసుకుంటాయి. అతిగా - హేతువాదులైనవారు మానసికంగా ఆరోగ్యవంతులు కారట - వాళ్ళు మనోరంజకమైన సాహిత్యంకూడా చదవాలట.

మరియో ప్యూజో అన్న నవలాకారుడు గాడ్‌ఫాదర్ వ్రాశాడు. అతడు రచయితలకు కొన్ని సలహాలు ఇచ్చాడు - సాధ్యమయినంత వరకు రచనను సుఖాంతం చేయమన్నాడు.

పాఠకులను సంతోష పెట్టదలస్తే ముందు కథ బాగుంటుంది.

కాని నిజాయితీ కల రచయిత ఆత్మవంచన చేసుకుంటాడా?

మరి అసలు కథ చదవండి.

* * *

కాలేజీలో ఇంటరు పూర్తిచేసి ఉద్యోగం కోసం ఖర్గపూరు వచ్చాను. మా పినతండ్రి కార్ఖానాలో పనిచేస్తూ ఉండేవారు. వాళ్ళు నింపురా బండిగూడు ఇళ్ళలో ఉండేవారు. పుట్టినదగ్గర నుంచీ ఆంధ్రదేశంలోనే గడిపిన నాకు ఈ ఇళ్ళు, ఈ బెంగాలు వాతావరణం చాల వింతగా కనిపించాయి. విశాలమైన మైదానం, వరుసలు తీరిన యిళ్ళు, తూర్పు తెల్లవారకముందే ఉద్యోగాలకు పోయే కార్మికులు, ఇరుగు పొరుగులనే నివసించే అన్ని జాతులవారు. క్రొత్త కొత్త తినుబడి వస్తువులు - ఇవన్నీ మొదట్లో చాల వింతగా కనిపించేవి. అప్పటికి నాకింకా పద్దెనిమిదేళ్ళు నిండలేదు. మా యిళ్ళ వరసనే చివరివేపు రావుగారని ఒకాయన ఉండేవారు. ఆయన చాల తెలివైనవారు. మంచి ఇంగ్లీషు మాట్లాడేవారు ఎప్పుడూ సరియైన దుస్తులలో వుండేవారు. ఆఫీసుకి వెళ్తే సూటు, ఇంటి దగ్గిర చేతులులేని బనియను. గూడకట్టు, నవ్వుతూ మాట్లాడడం ఎదుటివాడి సుగుణాలు క్షణంలో పడికట్టడం ఇవన్నీ ఆయనకు

అబ్బిన విద్యలు - ఆయనకు చాలమంది పెద్దవాళ్లు తెలుసు. వారిని మా పినతండ్రిగారు గురువుగా నాకు కుదిర్చారు - ప్రొద్దున్న ఎనిమిది నుండి తొమ్మిదివరకు ఆయన మాకు గుమస్తా పరీక్షకు కావలసిన విషయాలు చెప్పేవారు. నేను, నాతోపాటు పార్థసారధి అతని శిష్యులం.

మొదట రోజులలో మేము కట్టుకున్న బట్టలు చూచి ఇబ్బంది పడ్డారు - వృద్ధిలోకి రావలసినవాళ్లు క్రమశిక్షణ పాటించాలి. వేళకు రాకపోతే కోపపడేవారు.

రావుగారి ఇంటికి వెళ్తూ పది రోజులయింది. ఈ పది రోజులలోనూ వారింటి పక్కనే ఆ వరసలోని ఆఖరి యిల్లు ఒకటి ఉందని, ఆ యింటి ఆవరణలో పూలమొక్కలున్నాయని మాకు గుర్తులేదు. ఆరోజే అవన్నీ మాకంట బడ్డాయి. రావుగారి ఇంట చదువు మొదలుపెట్టిననాడే మనస్సు బందీ అయిపోయింది. ఏపాటి అశ్రద్ధగా ఉన్నా ఆయన చదువుచెప్పరు. ఉద్యోగం దొరకదు. ఇంతవరకు కాలేజీలో చాల స్వేచ్ఛగా గడిపిన జీవితానికి ఈ కట్టుబాట్లు చాల యిబ్బంది పెట్టాయి.

ఆ రోజు రావుగారు ఊళ్ళోలేరు. మొదటిసారిగా లైను చివరనున్న యిల్లు మా కంటబడింది. రాధాకృష్ణ అని బోర్డుమీద ఉంది. ఆవరణ గేటుదగ్గిర నిలబడి లోపల వరుసలు తీరిన పూల మొక్కలను చూచాము. కొన్నిటినిండా పూవులు ఉన్నాయి. కొన్ని శీతాకాలంలో పూయవలసినవి. అన్ని మొక్కలకు గొప్పులు తవ్వి పళ్ళాలు కట్టి శ్రద్ధతో నీళ్ళు పోస్తున్నట్లు కనిపించాయి,

జాఫరీ తలుపులు తెరచి ఉన్నాయి. లోపలనుండి ఒకాయన వెలుపలికి వచ్చారు. ఆయనకు దట్టమయిన జుత్తు ఉంది. ఆ జుత్తు వెనుకకు దువ్వుకున్నారు. ముఖం కొంచెం వెడల్పుగా ఉంది. ఫాలం చాల విశాలంగా ఉంది. దనువుల్లా కనుబొమ్మలు వంగినవి. ఆయనకు మీసంలేదు. గెడ్డం నున్నగా గీసి ఉంది. ఆయన బెంగాలీ లాల్చీ తొడుక్కున్నారు. మనిషి పొడవుగా ఉన్నారు.

"రాజూ! ఎవరో బెంగాలీ వాళ్ళలా ఉన్నారు. పద పోదాం!" అన్నాడు సారథి.

అప్పుడాయన ముఖమెత్తి మా వేపు చూశాడు.

అవి అతని కళ్ళా? పద్మ పత్రాలా? ఆ కళ్ళలో ఏమిటా వెలుగు? ఏదో అతిలోక సౌందర్యాన్ని తొలిసారి చూచినట్లయింది.

"నేను తెలుగువాడినే! దుస్తులు బెంగాలీవారివి. గేటు దగ్గిర నిలుచున్నారేం? లోపలికి రండి" ఆయన మమ్మల్ని ఆహ్వానించారు.

ఆవిధంగా ఆయన మాకు పరిచయమయారు. ఆయన మమ్మల్ని లోపలికి పిలిచాడు. జాఫరీ దాటితే పెద్ద గది ఉంది. బల్లమంచమొకటి గోడదగ్గర ఉంది. గది గోడలకు లేత నీలం రంగు వేసినట్లుంది. ఒక మూలను రవివర్మ వ్రాసిన రాధాకృష్ణుల చిత్రముంది. దాని ముందు

స్టాండులో ఊదొత్తుల లలితమైన సువాసనపైకి లేచి గది అంతా వ్యాపిస్తున్నది. గోడలకు ఒకటి రెండు చిత్రాలు వేలాడుతున్నాయి.

ఆ గది చాల శుభ్రంగా ఉంది. నేలమీద రంగుతో వేసిన ముగ్గులున్నాయి. బల్లమంచంమీద పరుపు, దానిమీద హంస రెక్కలవంటి దుప్పటి, రంగు గలీబులున్న బాలీసులు ఉన్నాయి.

ఆయన నవ్వుతూ మాతో మాట్లాడారు. వంట వండుకుంటున్నారు. తొమ్మిది గంటలకు భోజనంచేసి ఆఫీసుకు వెళ్తారు. ఆయన మమ్మల్ని సాయంకాలం ఏడుగంటల తరువాత రమ్మన్నారు. అప్పటికి ఆయన ఖాళీగా ఉంటారు. ఒక గంటసేపు మాట్లాడుకోవచ్చు.

ఇంటికి వచ్చిన తరువాతకూడా రాధాకృష్ణమీద ఆలోచనలు విడిచిపెట్టలేదు. భోజనంచేస్తూ మా పినతల్లిని అతని గురించి అడిగాను. అతను రెండేళ్ళయి ఆ యింట్లోనే ఉంటున్నారు. ఒంటరిగానే ఉన్నారు. ఆ వీధిలో వాళ్ళందరూ అతనిని జడభరతుడంటారు. అంతకుమించి అతనిగురించి ఎవరికీ తెలియదు. అతను ఎవరితోను చనువుగా ఉన్నట్లు కూడా లేదు.

అనుకున్న ప్రకారం నేనూ సాంథి సాయంకాలం ఏడు గంటలకు రాధాకృష్ణ యింటికి వెళ్ళాము. అతను వంట పూర్తిచేసుకొని వొళ్ళు కడుక్కొని వచ్చారు. తెల్లనిపంచ కుచ్చిళ్ళు పోసి కట్టుకున్నారు. బెంగాలీ లాల్చీ వేసుకున్నారు. నుదుట చిన్న కుంకంబొట్టు ఉంది. మమ్మల్ని లోపలికి పిలిచి, క్రింద చాపవేసి, మాతోపాటు కూర్చున్నారు. సాయంకాలంపూట పనిపాట్లు అయిన తరువాత కొంచెంసేపు ప్రార్థనచేయడం అతని అలవాటు.

తంబూరా శ్రుతిచేసి ఆయన రెండు శ్లోకాలు, ఒక పాట పాడారు. అవన్నీ బెంగాలీవారి బాణీలోనే ఉన్నాయి. మాకు అర్థం కాలేదు - మాకు అర్థమయిందల్లా అతని గొంతుకలోని ఆర్ద్రత - ఆ కంఠంలోని మాధుర్యం - ఆ మాధుర్యం పూల తేనె వంటిది. ఏదో పవిత్రమైన భావం అతని పరిసరాలలో వ్యాపించి ఉన్నట్లు మాకు అనిపించింది. చాలసేపు ఆయన బెంగాలీవారి ఆచార వ్యవహారాల గురించి మాట్లాడారు. చెరొక రాజభోగ్ ఇచ్చారు. మమ్మల్ని రోజూ రమ్మన్నారు.

ప్రతిరోజూ రాధాకృష్ణ దగ్గిరికి వెళ్లడానికి వీలయ్యేదికాదు. మా గురువుగారైన రావుగారు సుతరాం ఇష్టపడేవారు కారు. ఆయన కంటపడితే అరగంట లెక్చరిచ్చేవారు. కాలం దుర్వినియోగం చేయకూడదు. ఇటువంటి కుచ్చిటప్పాలు కొడుతుంటే ఉద్యోగం దొరికినట్లే. ఆవిధంగా మా కోరికకు బ్రేకుపడింది. కాని బ్రేకులులేని సైకిళ్ళను తొక్కే వయసేమో అది - రావుగారు ఊళ్ళోలేని సాయంకాలాలు విధిగా వెళ్ళేవారిమి - ఒకొక్కప్పుడు పెరటిదారిపట్టి యింట్లోకి దూరేవాళ్లము.

ఇన్నిబాధలుపడి రాధాకృష్ణ యింటికి ఎందుకెళ్ళాలని ప్రశ్న వస్తుంది. అతని ఆహ్వానంలో ఆత్మీయత నిండి ఉంది. ఆయన మాటల్లో నర్మగర్భంగా ఉండేవి లేవు. హేళనలేదు. ఏమి

మాట్లాడేవారమో మాకే తెలిసేది కాదు. కాని ఒకటిమాత్రం నిజం! భయానికి, ఆందోళనకి, ఉద్వేగానికి, సందేహానికి దినమంతా బాధపడిన మనస్సు, ఈ ఇంట్లోకి రాగానే, రాధాకృష్ణతో మాట్లాడగానే అనిర్వచనీయమైన ఆనందంతో నిండి, తేలికపడేది. ఆయన మృదువుగా, చిన్న నవ్వుతో చాల కొత్త విషయాలు, అన్నీ సాహిత్యానికి సౌందర్యానికి సంబంధించినవి, మాకు చెప్పి మమ్మల్ని తన్మయులను చేసేవారు. అందుచేత ఎన్ని బాధలైనాపడి అతని దగ్గిరికి రాత్రిపూట వెళ్ళేవాళ్ళము.

ప్రతీసారి ఆయన గురించి వివరాలు కనుక్కోవాలని అనుకునేవాళ్ళము. కాని ఆ అవకాశం మాకతను ఇచ్చేవారు కారు.

రాధాకృష్ణ గురించి తెలుసుకోడానికి కొంతకాలం పట్టింది. అది కూడా అంతంత మాత్రమే. అతను చక్కగా పాడతారు. బెంగాలీలో కవిత్వం చెప్తారు. రాధాకృష్ణ ఏవో ప్రణయగీతాలు చదివి వినిపిస్తుంటే ఒళ్ళుమరచి వినేవాళ్ళము.

ఒకనాడు పనికట్టుకుని మా గురువుగారైన రావుగారు మా యింటికివచ్చి మా పినతండ్రితో చాలసేపు నా గురించి చెప్పారు. మేసే గాడిద కూసే గాడిదను చేరిందని ఇంకేవేవో చెప్పారు. మా పినతండ్రి చాల కోపపడి, ఇటువంటి వెర్రివెర్రి వేషాలేవేస్తే విశాఖపట్నం తిరిగి పంపుతామన్నారు.

మనసు చాల బాధపడింది. ఎగరబోయే పక్షికి రెక్క కత్తిరించినట్లయింది. మనసుకి ఏ కొద్ది ఆనందం అతని స్నేహంలో లభించేదో దానిని కసిగా కాళ్ళక్రింద మట్టివేసినట్లయింది.

రెండు వారాలు గడిచాయి. మా పినతండ్రి కుటుంబంతో దేశం వెళ్ళిపోయారు. రావుగారు ఒకనాడు కలకత్తా వెళ్ళారు. ఆ రాత్రి రాధాకృష్ణ దగ్గరికి వెళ్లాను. దీపం మందంగా ఉంది. ఆయన ఆలోచిస్తున్నారు. ఉండుండి పుస్తకంమీద ఏదో వ్రాస్తున్నారు. నేను తలుపు తీసుకొని గదిలోకి ప్రవేశించిన పది నిమిషాలవరకూ లోనికి వచ్చినట్లు కూడా అతను గుర్తించలేదు. తీవ్రమయిన ఆలోచనలో ఉన్నారు. వ్రాయడమయిపోయిన తరువాత వ్రాసినగీతాన్ని చదివారు. మృదువుగా హృదయాన్ని కదిలించే ఆ గీతాన్ని వింటూ సర్వం మరచిపోయాను. అప్పుడాయన ఏవో అంటుంటే ఈ లోకానికి వచ్చాను.

"రెండు మైనాలు - వచ్చి నా కిటికీమీద వ్రాలాయి. వాటికి మాటలు నేర్పాను, నేను వ్రాసిన గీతాలు పాడి వినిపించాను. అవి నా పాట వింటూ తన్మయత్వాన్ని పొందాయి. రోజూ వచ్చి నాతో స్నేహంచేసి నా హృదయంలో చోటుచేసుకున్నవి. అదేమి దౌర్భాగ్యమో! ఒక్కసారి అవి రావడం మానేశాయి. వెలుతురు గాలి వచ్చే నా కిటికీ అప్పటి నుంచి శూన్యంగాఉంది,నా మాటలు ఎవరికి చెప్పను? నా పాటలు ఎవరికి వినిపించను?"

నాకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. నా కంఠం రుద్ధమయింది. ఏం కారణం చెప్పగలను?

వెళ్ళిఅతని రెండు కాళ్ళు పట్టుకున్నాను. మేము చేసిన అపరాధం క్షమించరానిదనిపించింది. ఆయన నన్ను లేవనెత్తి బల్ల మంచం మీద తన పక్కనే కూర్చోపెట్టుకున్నారు.

"రాజా! మీర్దిరూ నా జీవితంలోకి ప్రవేశించకముందు నేను ఒంటరిగా నా ఊహాలోక సంచారం చేసేవాడిని. మీరు వచ్చిన తరువాత నా అనుభూతులను మీతో పంచుకున్నాను. ఒక్కసారి, ఒట్టు పెట్టినట్లు రావడం మానేశారు. నన్ను శిక్షించడానికి మరేవీ మార్గాలు లేవా?'

నేను వెక్కి వెక్కి ఏడ్చాను

"నువ్వు పైకి రోదిస్తున్నావు. నేను మనసులోనే కుములుతున్నాను."

"లోకంలో కొందరికి పదవి, ధనం, అందమయిన భార్య, చక్కని పిల్లలు, పేరు, ప్రతిష్ఠ... ఇవన్నీ చాల ముఖ్యం. వాటి కోసం కుసుమాల వంటి మృదువైన హృదయాలను నలిపి పారవేస్తారు."

"అవును రాజా! లోకంలో మనవంటి వారిని అర్ధం చేసుకున్న వాళ్ళు తక్కువ."

క్రమంగా ఆయన ప్రసంగాన్ని మరో దారి పట్టించారు. విద్యాపతి శృంగార పదాలు పాడి వినిపించారు.

తిరిగి రాధాకృష్ణను కలియడానికి మరో పది రోజులు పట్టింది. పూరీలో వారం రోజులు కుటుంబంతో విలాస యాత్ర కని మా గురువు గారు వెళ్ళారు. వారిని ఎక్స్‌ప్రెస్‌కి దిగబెట్టి ఇంటి వేపు వచ్చేసరికి తొమ్మిదిన్నర అయింది. రాధాకృష్ణ గారి జాఫిరీ తలుపు మూసి లేదు. గది తలుపు కూడా తెరచే ఉంది. లోపల నుంచి మధురమైన గానం వినిపిస్తుంది. మెల్లిగా లోపలికి ప్రవేశించాను. తలుపు దగ్గిర నిలబడ్డాను.

రాధాకృష్ణ గది మధ్యలో నిలబడ్డారు. తెల్లటి పట్టుపంచ కట్టుకున్నారు. నడుముకి పట్టు వాణీ చుట్టుకున్నారు. అతని నుదుట చక్కని తిలకముంది. గిరజాల జుత్తు వెనుకకు దువ్వుకున్నారు. ఆయన మెల్లిగా పాడుతూ నాట్యం చేస్తున్నారు.

చంద్రక చారు మయూర శిఖండక
మండల వలయిత కేశం
ప్రచుర పురందర ధనురను రంజిత
మేదుర ముదిత సువేశం
　　రాసే హరిమిహ విహిత విలాసం
　　స్మరతి మనోమమ కృతపరిహాసం.

లయానుబద్ధంగా అతని అంగాలు కదులుతున్నవి. గీత గోవిందంలోని అష్టపదిని

అతను అభినయిస్తున్నారు. చేయి తిరిగిన నాట్యాచార్యులుకూడా అంత సులువుగా అంతటి కౌశలాన్ని ప్రదర్శించ లేరు. ఆ నాట్యం అలా వివిధ గతులలో వికసించింది.

నాట్యం అయిపోయిన తరువాత పక్కనున్న తువ్వాలు తీసుకొని అతను ముఖం తుడుచుకుటుంటే నేనతని కళ్ళ పడ్డాను.

"రాజా! వచ్చి ఎంత సేపయింది?"

"ఒక్క అరగంట".

"కవిత్వం రాస్తున్నప్పుడు, నాట్యం చేస్తున్నప్పుడు నేను వేరే లోకాలలో ఉంటాను. మరేమీ అనుకోకు."

"అనుకోడానికేముంది - విప్పారిన కళ్ళతో మీ నాట్యం చూసే భాగ్యం కలిగింది".

"మరచి పోకుండా ఉండడానికి అప్పుడప్పుడు అభ్యసిస్తూ ఉంటాను"

"మీరేమో కృష్ణుడి వేషంలో ఉన్నారు మరి మీ రాధాదేవి?" అతను ఆలోచిస్తున్నాడు.

"ఆమె శరీరం వేల కొలది మైళ్ళదూరంలో ఉంది. ఆమె హృదయం నాతోపాటు అభినయం చేస్తున్నది."

అతని రాధ ఎవరు? అతను సరియైన సమాధానాలు చెప్పరు. ముసి ముసి నవ్వులు నవ్వుతూ ఊరుకుంటారు.

క్రమక్రమంగా రాధాకృష్ణ రహస్యంలో కొన్ని భాగాలు అవగతమయినాయి. అతని రాధ చిన్న రాసమణి. ఆమె ఆరు నెలల క్రింద పారిస్ నుండి స్విట్జర్లాండు వెళ్ళి అక్కడ ఉంటున్నారు. రాణీ రాసమణీదేవికి ఆమె ఏకైక వారసురాలు. మరో ఆరు నెలల్లో ఆమె చదువు పూర్తి చేసుకుని వస్తున్నారు.

నాకు మతిపోయినట్లయింది. నక్కెక్కడ, దేవలోకమెక్కడ - చిన్న రాసమణి విదేశాలలో ఉంటున్నారంటే లక్షాధికారులై ఉండాలి. మరి రాధాకృష్ణ - అతి సామాన్యుడు - ఈ ఇరువురి ప్రణయంలో అర్థముందా? ఇటువంటి విషయాలు ఒకప్పుడు అంతు పట్టవు.

అవకాశం దొర్కినప్పుడు రాధాకృష్ణను కలిసేవాడిని. ఒకసారి ఆయన ఒకే కవిత్వం చెప్పారు. జలకాలాడే సుందరి ఆ గీతం పేరు. జలజల కురులమీద నుంచి రాలి, కనురెప్పల అంచులను పట్టుకొని, సంపెంగ పూవు వంటి నాసిక మీద జారి, కపోలాల మీద కదనుతొక్కి, శంఖగళంపై పరువులు తీసి, పృథువక్షోజాల మీద నటనమాడి, క్షణం నతనాభిలో తలదాచుకొని, జఘన సీమల ప్రాకి, జలజల పారిజాతాలవలె చరణ పల్లవాల మీద వ్రాలి ఆ జలాలు ఆనందతరంగితాలవుతున్నవి. ఎంత ధన్యమైనది వాటి జన్మ..... ఆయన ఆ గీతం చదువుతుంటే సెలయేటినీళ్ళు పారినట్లు, పారిజాతాలు రాలినట్లు, ఏవో వ్యక్తం చేయలేని అనుభూతులు పరిమళించాయి.

మరికొన్ని సదవకాశాలు కలిగాయి. మా గురువు గారికి ప్రమోషను మీద గార్డెన్‌రీచి ఆఫీసుకి వేశారు. సారథి రావడం మానేశాడు. నేను నిత్యం రాత్రి రాధాకృష్ణ గారింట హాజరయ్యే వాడిని.

క్రమంగా అతని విశ్వాసానికి పాత్రుడనై అతని జీవితంలో కొన్ని భాగాలను తెలుసుకున్నాను.

రాధాకృష్ణ తండ్రి అనకాపల్లిలో పౌరోహిత్యులు, వారి పిన తండ్రి భీమశాస్త్రి గారు రాణీ రాసమణీదేవి గారి దగ్గర దివానుగా ఉండే వారు. చదువు సంధ్యలు లేకుండా తిరుగుతున్న ఎనిమిదేళ్ళ కుర్రాడిని తమతో కలకత్తా తీసుకొని పోయారు. అది రాధాకృష్ణ జీవితంలోని మలుపు. ఒకసారి రాసమణీదేవి గారి యింటికి రాధాకృష్ణను తీసుకొని పోయారాయన. విశాల మైన కళ్ళు, అందమైన ఆకారం కల కుర్రాడిని చూచి రాణీ గారు ముచ్చట పడ్డారు. మనుమరాలు సంగీతం నేర్చుకుంటే, నాట్యం చెప్పించుకుంటే అక్కడ రాధాకృష్ణనుకూడా ఉండడానికి అనుమతించారు. ఆ విధంగా అతనికి సంగీతం, నాట్యం అలవడ్డాయి. చురుకైనవాడు. భాష సులువుగా నేర్చుకున్నాడు. చిన్న రాసమణితో ఆ పరిచయం క్రమంగా వృద్ధి చెందింది. రాణీ రాసమణీ దేవి పనులలోపడి అంతగా పట్టించుకోలేదు. కాని ఒక రోజు ఆమెకళ్ళను ఆమె నమ్మలేక పోయింది. ఆమోపై అంతస్తులోని తన ఆఫీసు గది లోంచి క్రింద నున్న లాన్ వేపు చూసింది. అప్రయత్నంగా, చిన్నరాసమణి పరుగు పరుగున వచ్చి అక్కడ నిలబడి ఏదో కాగితం చదువుతున్న రాధాకృష్ణను కౌగలించుకొంది.

"కన్నయ్యా! నీ గీతమెంత మధురంగా ఉంది."

చిన్న రాసమణి అతనిని కన్నయ్యా అని పిలిచేది. రాధాకృష్ణకు తప్పించుకోడానికి వీలు లేక పోయింది. అతనికప్పుడు పద్దెనిమిదేళ్ళు. చిన్న రాసమణికి పదిహేను. రాణీ రాసమణీదేవి ఇద్దరినీ వేరుచేయడానికి చాలా ప్రయత్నాలుచేసింది. అవేవీ ఫలించలేదు. అప్పుడామె మనుమరాలిని పారిస్ పంపించే ఏర్పాటు చేసింది. ఈ తతంగం మూడు సంవత్సరాలు పట్టింది. కాని, రాధాకృష్ణ తనతో రానిదే పారిస్ వెళ్ళని చిన్నరాసమణీ భీష్మించుకొని కూర్చుంది. చివరికామె ఒప్పుకుంది.

ఒప్పుకోనిది విధి.

వారం రోజులుంది పారిస్ ప్రయాణం. స్టీమరులోప్రయాణానికి ఏర్పాటులు పూర్తి అయాయి. అప్పుడు అనకాపల్లి నుంచి టెలిగ్రాం వచ్చింది. రాధాకృష్ణ తండ్రికి ప్రమాదంగా ఉంది. మరునాడు మనిషే వచ్చాడు. రాణీ రాసమణీ దేవి చాల తెలివిగా ప్రవర్తించింది. తప్పకుండా రాధాకృష్ణను పారిస్ పంపుతానంది. ఒక నెల్లాళ్ళ వ్యవధిలో చిన్న రాసమణిని కలియవచ్చునంది. తరువాత రాధాకృష్ణ తండ్రి చనిపోయాడు. కర్మిష్ఠులు అతనుసంవత్సరం వరకు సముద్రయానం చేయరాదని నిషేధించారు. అన్నీ అయిన తరువాత రాధాకృష్ణ

కలకత్తా వచ్చాడు. పిన తండ్రిన కలిశాడు. ఆయన రాణీగారిని కలియమని పంపించారు.

రాణీ రాసమణీ దేవి హృదయం అపుడు బయట పడింది.

ఆమె రాధాకృష్ణను చాల హీనంగా చూసింది. పరుషంగా మాట్లాడింది. చిన్న రాసమణికోసం పెద్దింటి యువకులున్నారు. ఇటువంటి దరిద్రుడికి మనుమరాలినిస్తే వంశగౌరవం మట్టిపాలవుతుంది..........

లోకంలో కొంత మంది వ్యక్తులను అర్థం చేసుకోవడం కష్టం - రాధాకృష్ణ విషయంలో చాల కష్టం.

అతను నిరాశ పడలేదు. ఖర్గపూర్ వచ్చి కార్ఖానాలో గుమాస్తా ఉద్యోగం సంపాదించాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత చిన్నరాసమణి చిరునామా సంపాదించి ఉత్తరం రాశాడు. దానికి జవాబు వచ్చింది. ఆ మోడిన మొక్కకు తిరిగి చిగుళ్ళు తోచాయి. ఆమెకోసమే అతను .... సర్వాంగ సుందరుడై, నాట్య కారుడై, కవియై.... జీవితం సాగిస్తున్నాడు.

మాకు ఉద్యోగం కోసమైన టెస్ట్ నెల రోజుల తరువాతనని తెలిసింది. రెండు వారాలు ఆయనను కలియలేక పోయాను. ఒక ఆదివారం మధ్యాహ్నం రాధాకృష్ణ ఇంటికి వెళ్ళాను. తలుపు తోసుకొని లోపలికి వెళితే ఆయన బల్లమంచంమీద పడుకున్నారు. అతని కళ్ళు లోతుకు పోయాయి. ముఖంలో కళ్ళకింద నల్లటి చారికలు. ఆయన చాల చిక్కిపోయారు.

ఎంతో ప్రయత్నం మీద తెలుసుకున్నాను. చిన్న రాసమణి దగ్గర నుండి రావలసిన ఉత్తర్వం మూడు వారాలై రాలేదని - అతని మానసిక మైన ఆవేదన ఎలా తగ్గించగలను? ఏవో మాట్లాడాను- అతని గీతాలు వినిపించుకున్నాను. - ఏం చేసినా లాభం లేక పోయింది.

ఉద్యోగంలో కూడా అతను అప్పుడప్పుడు తప్పులు చేస్తున్నాడు. అధికారులు కేకలేస్తున్నారు.

ఆవరణలో పూల మొక్కలు కొన్ని ఎండి పోయాయి. కొన్ని వెర్రిగా పెరిగిపోయాయి. ఎవరూ వాటిని పట్టించుకోలేదు.

మాకు పరీక్ష మరి రెండు రోజులే ఉంది.

మా గురువుగారు మామీద దయదలచి ఆ ఆదివారం వచ్చారు. మా ఇంట దిగారు.

నన్ను సారథిని దగ్గర కూర్చోబెట్టి ఇంగ్లీషులో డిక్టేషను చెప్పారు. ఆ నాటి పత్రిక నుండి.

"రాసమణి తన ఇరవై ఒకటవ యేట స్విట్జర్లండులో చనిపోయినందుకు మేము చాల విచారిస్తున్నాము - రాణీ రాసమణీ దేవికీమె వారసురాలు - మూడు సంవత్సరాలయి పారిస్‌లో చిత్రలేఖనం నేర్చుకుంటున్నారు. ఆరు నెలలయి అనారోగ్య కారణాలవల్ల స్విట్జర్లాండు వెళ్ళి అక్కడ పరమపదించారు. మంచి రూప వంతురాలు. నాట్యంలో అసమాన పాండిత్యం, సంగీతంలో విశిష్టమయిన ప్రతిభ, చిత్రలేఖనంలో అద్వితీయమైన కౌశలం కలిగిన చిన్నరాసమణి

మనను విడిచిపోయినందుకు పరితపిస్తున్నాము..."

వ్రాస్తున్నానే కాని నా మతి మతిలో లేదు. పాఠం అవగానే రాధాకృష్ణ ఇంటికి పరుగెత్తాను. ఆయనలేరు కలకత్తా వెళ్ళారు.

ఆ ఇంటి వాకిటలో రోజంతో కూర్చున్నాను. రాత్రి ఎనిమిదింటికి ఆయన వచ్చారు. ఆయనను పట్టలేక పోయాను. కట్టలు దాటి ప్రవహించింది మహాశోకం.

ఆయనను ఓదార్చాలని ప్రయత్నించాను. లాభం లేక పోయింది.

"ఆ రాసమణి ఎవరో దూరంగా ఉన్న స్నేహితురాలు. ఆమె కోసం ఇంతగా పరితపించాలా? మీకు వయసుంది. నూరు మంది రాసమణులు మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటారు." అన్నాను ఎప్పటికీ అతను ఏడుపు మానకపోతే.

అతను ఏడుపు మానారు. నావంక చూచారు. అతని ముఖంలో పేదమైన నవ్వు తోచింది.

"రాజా! ఇంతకాలం నాకు సన్నిహితుడుగా ఉన్నావు. నన్నింకా అర్థం చేసుకోలేదా? ఆమెకోసం ఈ జీవితం సాగిస్తున్నాను. ఆమె లేని జీవితానికి అర్థముందా"?

రెండు రోజులు అపనితోనే ఉండిపోయాను.

మూడవరోజు ఉదయం అతను ఒక దారికి వచ్చారు.

"రాజా! నువ్వు ఇంటికెళ్ళు. రెండు మూడు గంటలు నన్ను విడిచిపెట్టు. నా రాసమణిని మరచిపోయే ముందు ఆమె గురించి ఏకాంతంగా ఆలోచించుకోనీ"

ఆయన మాటలకు కాదనలేక పోయాను

ఇంటికి పోయి పనులు చేసుకొని పది గంటలకు రాధాకృష్ణ ఇంటికి వచ్చాను. జాఫిరీ తలుపు తీసి ఉంది. అక్కడ నున్న కుర్చీమీద ఒక బెంగాలీ మహాశయుడు కూర్చున్నాడు

నేను లోపలికి ప్రవేశిస్తుంటే అతను రాధాకృష్ణ గురించి ప్రశ్నించాడు.

"అతను ఇంట్లోనే ఉన్నారు - కూర్చోండి పిలుచుకు వస్తాను" అన్నాను.

గది తలుపు తీసే ఉంది. లోపల చాల శుభ్రంగా ఉంది. మంచం మీద హంస రెక్కలవంటి దుప్పటి - రంగు బాలీసులు, అగరుధూపం,రాధాకృష్ణులుండే చిత్రానికి బదులు ఒక మహా సుందరి చిత్రముంది.

ఆమె రాసమణి

ఆమె ఎదుట ఒక గీతం ఉంది. కాగితం మీద వ్రాసి పాదాల వద్ద-

ఓ రాసమణీ !

చిన్నపిల్లల నవ్వులో, వికసించే పూవుల రంగుల్లో
పారిజాతపు పరిమళంలో, ఉషోదేవి చిరునవ్వులో
మలయమారుతం స్పృశించిన వల్లకీ మూర్ఛనలో
ఎక్కడ సౌందర్యమూ, శాంతీ, ప్రణయమూ
గుబాళిస్తుంటాయో
అక్కడే నీవుంటావు ; నువ్వు లేవనుకోడం ఎంత తప్పు"

ఆ వచ్చిన పెద్దమనిషి నా వెనకనే లోపలికి వచ్చాడు.అతని కళ్ళనిండా నీరు.
వంగ భూమి పత్రిక వారికి పదివేల రూపాయలు పంపింది చిన్న రాసమణి.
ఆ సంవత్సరం కవిత్వంలో ఉత్తములకిమ్మంది.
రాధాకృష్ణకు ఆ బహుమతి పెద్దలు ఇవ్వాలనుకున్నారు
కాని ఆ రాసమణీ లేదు.
ఆ రాధాకృష్ణ లేడు.
అతని గీతాలు మాత్రమే ఉన్నాయి.
ఇదీ అసలు కథ.